# నాకు నచ్చిన నా కథ

నా కథా రచనలలో తొంభై ఎనిమిది శాతం విషాదాంతాలు. 'ఎంతటి కఠినాత్ముడి కండ్లల్లోనైనా సరే నీటిచారలు తిప్పకుండా వుండలేదు నీ లేఖిని' అంటుండే వాసుకవి, కథకుడూ నా మిత్రుడూ అయిన శ్రీ పురాణం కుమార రాఘవశాస్త్రి. విషాదభావాలు ఆధారంగా ఆర్ద్రహృదయంతో, ఆరని ఆవేదనతో కథలు అల్లటం నాకు మొదటినుంచీ అలవాటైంది.



శ్రీ జనస్వామి
కోదండరామ శాస్త్రి

ఈ కథ మూడున్నర దశాబ్దాల క్రితం హైదరాబాదు నుంచి వెలువడిన సుజాత అను సాహిత్య మాసపత్రికలో ముద్రణ అయింది. ఆ వెంటనే గుంటూరులో కన్పించిన అస్మదీయ గురుసమానులు, భావకవిత్వ సాంప్రదాయ ప్రారంభకులు, నవ్య సాహిత్య సమితి వ్యవస్థాపకులు అయిన తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రిగారికి చదివి వినిపించాను. చివరలో ఆయన 'జేబుగుడ్డ ఇవ్వవోయ్, కళ్లు తుడుచుకోవాలి' అన్నారు. ఈ కథలో పేర్కొనబడిన కొల్లూరురోడ్డు రైల్వేస్టేషన్ ఇప్పుడు వేమూరు స్టేషన్‌గా మారింది.

'మిత్ర రత్నం' అను యీ కథ నాకు నచ్చిన కథ. ఈ కథలో హృదయార్ద్రిత దుఃఖానుభూతి అనంతగా యీ కథలో వెళ్ళబోసుకున్నా ననుకుంటాను.

భావ బలీయత, భాషా శిల్పం తక్కువ మాటల్లో ఎక్కువ కథాభాగం ఇమిడ్చి చెప్పగలిగిన నేర్పు వర్తమాన సాంఘిక జీవన అనుసరింపు మనోజ్ఞ మానసిక చిత్రీకరణ సంభాషణా చాతుర్యం-ఇవన్నీ కథా రచన విజయానికి తోడ్పడగలవనుకుంటాను

# మిత్ర రత్నం

స్నేహలతాదేవికి ఆమె తండ్రి ఎన్ని విధాల బోధించి చూచినప్పటికీ ఆమె ధోరణిలో కించత్ మార్పయిననూ కన్పించుటలేదు చివరకు ఆయన విసుగుచెంది తన కన్నబిడ్డే తనయందు రవ్వంతైనా లక్ష్యభావం లేకుండా తన మాటను నిరాకరిస్తున్నదనే కారణంవలన కలిగిన రోషావేశమును పరిమితంగా జూపుతూ ఇలా అన్నాడు "మేమిరువురం ఊపిరి పీలుస్తూ ఇంకా నిల్చిఉన్నాం కాబట్టి నిన్ను గురించి ఇలా అదుర్దా పడుతున్నాం నువ్వు ఎంత అలక్ష్యంగా ఖండితంగా మాట్లాడుతూన్నప్పటికీ నీ ధోరణికి తగిన పద్ధతిలో జవాబిచ్చుటకు నా నాలిక అంగీకరించగలదా?" —

అంతకు ముందునుంచీ ఎంతో స్థిరనిశ్చయంగా గాంభీర్యంగా మాట్లాడుతూండిన స్నేహలతాదేవి ఒక్క తడవగా దీనత్వంతో నిండిపోయి చిన్నపిల్లవలె కండ్లనిండా నీరు తెచ్చుకుని అన్నది అదేమిటి నాన్నా? అలా మాట్లాడుతున్నారు?"

తన బిడ్డయొక్క గులాబి చెక్కిళ్ళపై కాటుక కన్నీటి కణములు ప్రవహించుట గాంచుసరికి ఆ పితృహృదయం కొంచెంగా జలదరించినది "నీ భర్త విషయంలో అవిధేయతగా ప్రవర్తించమని చెప్తున్నానా తల్లీ? ఈ స్థితిలో చాకిరీ చేసుకుంటూ నీవిలా బాధపడుతూవుంటే మేము అక్కడ సుఖంగా వుండగలమా? తప్పకుండా తీసుకుని వెళ్ళండని లేడీడాక్టర్ నీముందే కదా చెప్పినది! అల్లుడు కూడా అంగీకరిస్తున్నాడు కదా? నీకు ఇంకా ఏమిటి సందేహం" అని అన్నాడు కడుపుతీపి పొంగిపొరలుతూండిన కంఠస్వరంతో —

స్నేహలత అర్థంకాని ఆవేదనతో తండ్రివంక ఒక తడవ చూచి ఇలా అన్నది "సందేహ మేముంటుంది నాన్నా? ఆయన తత్వం నాకు ఒక్కర్తెకు తప్పితే ప్రపంచంలో మరెవ్వరికీ తెలియదనుకుంటాను ఆయన తీరు అర్థంకాక

ఒక్కొక్క సందర్భంలో కన్నతల్లే నెత్తిన నోరెట్టుకొని మొత్తుకుంటూ వుండే దట నేనైనా ఇంతకాలపు సాహచర్య ఫలితంగా కొద్దిగా మాత్రమే అర్థంచేసుకో గలిగానేమో? సదా జ్ఞానరశ్మితో ప్రకాశించుచుండు ఆయన పవిత్రహృదయంపై నా కృత్రిమ హస్తం వుంచి నాపై కొంత మమత కలిగింపజేసుకుని యీ లోకంలో 'మానవుడు'గా జీవించగల విధములలో ఆయనచేత విషపానం చేయించుతూ నా ప్రయత్నంలో నేను నాల్గవ వంతుగానైనా విజయం పొంద గలిగాను కదా అని గర్వపడుతున్నాను నా అస్వస్థతను గూర్చి ఆయన నేడు కొద్ది కలతపొందటమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం" అపరిమితమైన హృదయావేదనతో ఆమె నుండి యీ మాటలు వెలువడినవి ఈ లోకపు వాతా వరణమునకు అనుకూలంగా తన భర్తలో మార్పుతేవాలని తాను అనుసరిస్తూం డిన విధానంలో కొంత ద్రోహం అపచారం ఇమిడి వున్నదని ఆమె బాధపడు తూన్నట్లుగా ఆ కంపిత కంఠస్వరంలో ద్యోతకమవుతూన్నది

సామాన్య మానవులకు అంత తేలిగ్గా అవగతంకాని ఆచార్య సుదర్శన్ విచిత్ర స్వభావమును కాపురమునకు వచ్చిన క్రొత్తలో స్నేహలత కొంత కాలం సహించి వూరుకున్నది. ఆ తదుపరి అతనిలో మార్పు కలుగగలందు లకుగాను అనేక రకాల పాచికలు ఉపయోగించింది భూషణగా ప్రయోగించిన వేవీ పనిచేయకపోవుట గమనించి అలసటజెంది అలక్ష్య పదప్రయోగం ప్రారం భించింది కాని ఇన్నిటికీ అతని వద్దనుండి ఆమె పొందగలిగే జవాబు శాంత పూరితమైన ఒక చిరునగవు మాత్రమే ఆ మృదుమందస్మితం అప్పుడు ఆమె నయనములకు వికృతంగా జుగుప్సాకరంగా కానవస్తుండేది గాని అది సమస్త ప్రపంచానికీ శాంతిసౌఖ్యాన్ని పంచి ఇచ్చే ఒక పవిత్ర సామగ్రి అనీ ఆ ముసి ముసి నవ్వులు శీతల జ్యోత్స్నా వీచికలై తన ఆత్మను సౌఖ్యడోలికల్లో ఊగింపగల మహత్తర సాధనములనీ స్నేహలతాదేవి ఇప్పుడు భావిస్తున్నది

ఈమధ్య నాలుగుమూడు మాసములనుంచీ ఎందువల్లనో స్నేహలతా దేవిలో గొప్ప మార్పు పొడచూపుచున్నది ఇంతకాలంనుంచీ ద్వేషించుతూ వచ్చిన సుదర్శన్ స్వభావమూ, అతని జీవిత లక్షణములూ ఆమెను నేడు మిక్కిలి ఆకర్షించుతూన్నవి అవి అసమర్థతా సూచకములు కావనీ దివ్యాత్మ యొక్క స్వచ్ఛకాంతులని, నిశ్చయించుకున్నది దారుణ హింసాకాండతో సత మతమైపోతూవుండిన యీనాటి మానవ సమూహంలో పవిత్రవాయువులు వీయ గలందులకై యీ కృత్రిమ ప్రపంచంలో అక్కడక్కడ చెదురుగా ఇటువంటి

ఉత్తమ మానవుల పుట్టుక ముఖ్యావసరమనీ ఆమె భావిస్తున్నది గుమ్మం ముందు జట్కాబండి ఆగిన శబ్దం వినిపించింది. మరుక్షణంలో సుదర్శన్ వరండాలోకి వచ్చి తన మామగారికి విధేయతగా నమస్కరించి "అటు బజారుకు వెళ్ళి వచ్చారా మామా?" -అని పలకరిస్తూ గదిలోకి వెళ్ళాడు. అతని వెనుక నుంచే లత కూడా లోపలకు వెళ్లి సమీపంగా నిలబడి ఆతురతగా అన్నది. "తప్పదు, రావలసిందే నంటున్నారు మా నాన్న?"

"ఇంకేం! వెళ్ళు" అని సుదర్శన్ జవాబు, కోటువిప్పి చిలకకొయ్యకు తగిలిస్తూ. ఆమెలోని విజయగర్వం కొంచెం దెబ్బతిన్నది. ఆ మాటలోని ఇసుమంత అలక్ష్యభావం ఆమె గుండెల్ని అసూయాప్రభావంతో దహించివేస్తూండగా ఉక్రోషంతో ఇలా అన్నది. "అవును, యీ ప్రతిబంధకం తొందరగా ఒదిలిపోతే మరల కొంతకాలం పాటు జీతండబ్బులు బిచ్చగాళ్ళకు పంచేస్తూ సుఖంగా ఆ ధర్మశాల వద్ద కాలం గడపొచ్చుకదూ? అప్పుడు మీ ప్రాణం హాయిన పడుతుంది."

ఈ మాటలతో అతని మనసు చివుక్కుమన్నది. "లతా నేను నిన్ను ఎప్పుడూ ప్రతిబంధకంగా భావించుటలేదు. ఈ అంధపథికుడ్ని విశాలవిశ్వమనెడి ముళ్ళపొదల్లోకి నెట్టుతూ స్నేహలత అనే ఒక మిత్ర రత్నాన్ని నాకు భగవంతుడు ఏర్పాటుచేశాడు. మన వివాహం భగవంతుని ప్రత్యేక నిర్ణయ ప్రకారమే జరిగింది లేకపోతే ఆగర్భ శ్రీమంతుని సుకుమార బిడ్డవు నీ వెక్కడ? నిరుపేద కుటుంబంలో జన్మించి దాతల దయాభిక్షలో వూపిరి పీల్చుకుంటూ జీవించి యీ నాటికి ఏదో నాలుగుకాన్లు సంపాదింకుంటూన్న యీ నీళ్ళ బిందెల మునలమ్మ కుమారు డెక్కడ? యీ దీనుడు నిరాశ్రయుడై దుమ్ములో ధూళిలో కలిసిపోగలడనే జాలితో దైవనిర్ణయం యిలా జరిగింది." అతని మాటల్లో రాగాలాపన నల్పుతూండిన విషాద సంగీతము. ప్రతిపదంలోనూ గర్భితమై యున్నట్టి మహోన్నత భావములూ ఆమె హృదయము ద్రవింపజేసినవి. అసలే పటుత్వము కోల్పోయిన ఆమెలోని నరములు యీ మాటలతో మరీ నీరసించి పోతూండగా స్నేహలత వలవల విలపిస్తూ అతని పాదపద్మములపై వాలి ఇలా అన్నది "నాకు మా తండ్రికీ ఒక్క లక్ష్మీదేవియొక్క స్వరూపం మాత్రమే తెలుసును. అంతకు తప్ప మరేమీ మాకు తెలియదు. ఆశలతోనూ, కాంక్షలతోనూ, అసూయాద్వేషములతోనూ కరడుకట్టుకునిపోయిన మా అల్ప హృదయములు పరిక్షుభము కాబడి కొన్ని మహత్తర శక్తులకు సన్నిహితం

కాగలందులకే మీరు భర్తగాను, మా తండ్రికి అల్లుడుగాను సంప్రాప్తించుట సంభవించింది."

ఇంతలో వంటగది నుంచి భోజనాలకని పిలుపు వచ్చింది. ఇరువురూ చెరి ఒకదారినా వెళ్లిపోయినారు.

భోజనములు ముగిసినాక ఒకగంట గడిచిన తదుపరి ప్రయాణ సన్నాహములు జరుగుతూన్నవి. స్నేహలతాదేవి తండ్రి కొంచెం సామాను బండిలోకి జేరవేస్తున్నాడు ఆమెమాత్రం దీనురాలై మౌనంగా శయనాగారంలో భర్త సాన్నిధ్యమున నిలబడి వున్నది.

"చాలా జాగ్రత్తగా ఉండాలి. ప్రథమ పర్యాయం కూడాను. శరీరంలో రక్తం కూడా క్షీణించినట్లున్నది" అన్నాడు సుదర్శన్ విచారించగా తెల్లగా పాలిపోయి నిర్ఝర స్రవంతివలె క్షీణించిపోయిన ఆమె ముఖబింబంలోనికి దృష్టి సారిపుతూ.


"నా సంగతి అలా వుంచండి ఆహారపానాదులలో అలక్ష్యం చూపననీ, ఆరోగ్యమును కాపాడుకొనుటలో తగినశ్రద్ధ కనపరుస్తావనీ మీరు నాకు వాగ్దాన మిస్తేగాని కదలను."

అతని ధీరహృదయం ఆ నిముషమున ఏలనో అపరిమితముగ కలవర మొందినది. విచారంగా, నిస్సారంగా గద్గదిక కంఠస్వరాన అన్నాడు. "పిచ్చిదానా? నా విషయంలో ఆదుర్దా పడుతున్నావా? ఎందుకో సంతోషంగా నిన్ను యీ తడవ పంపలేకపోతున్నాను. నాలోని అంతశ్శక్తి సందేహంగా గొణుగుతున్నది."

లలిత దీనాతిదీనంగా క్రింద కూలపడిపోయి అతని పాదములపై తన శిరమును వుంచి పాదధూళి తీసుకుని బాష్పబిందువులతో అతని కాలివేళ్లను తడుపుతూన్నది. ఇంతలో తండ్రి వచ్చి లేవతీసుకుని వెళ్లి బండిలోకి ఎక్కించాడు. సుదర్శన్ విచారగ్రస్తుడై గుమ్మంలో నిలబడి వున్నాడు. చిరుగంటల చప్పుడు చేసుకుంటూ బండి సాగింది. స్నేహలతాదేవి దీనదృష్టులు అతని నేత్రములందు నీటిచారలను త్రిప్పుతూన్నవి.

## 2

స్నేహలతాదేవి పుట్టింటికి వెళ్ళిన లగాయతు ఆచార్య సుదర్శన్ యొక్క నిత్యజీవితం క్రమాను గతములైన మార్పులు పొంది మరల వెనుకటి స్థితిలోనికి వచ్చినది. కాలేజీలో పనిచేయవలసిన కాలం పూర్తికాగానే ధర్మశాల




వద్దకు వెళ్ళిపోయి అచట చేరివుండు భిక్షుకుల సమూహంలో సంతోషంగా కాలం వెళ్ళబుచ్చుకుంటూండేవాడు. ఎచటనూ బిచ్చం లభింపక క్షుద్బాధతో వేగిపోతూండిన ఆ ఆకలి జీవుల మధ్య వెండి నాణెములు వెదజల్లి హోటల్ వైపుకు దారి చూపించుతూ, జాడ్యములతో బాధపడేవారికి తగిన వైద్య సౌకర్యములు సమకూరుస్తూండేవాడు. సానుభూతిగా, అనురాగంగా పలకరించి, జీవిత ఆశలన్నిటినీ కోల్పోయి ఈ సమస్త మానవ ప్రపంచమూ వారి పాలిట ఒక విశాలమైన ఎడారిగా పరిణమించిన ఆ నిర్భాగ్య హృదయులయొక్క నిశీధ జీవనబాటల్లోనికి కొద్ది వెలుగు చొప్పించుటకై ప్రయత్నం చేస్తూండేవాడు. స్నేహలతాదేవి వద్దనుండి ఆందోళనా పూరితములైన విషయములతో కూడిన జాబులెన్నో అతని పేరిట వచ్చినవి. ఎప్పుడు వచ్చిననూ ఆచార్య సుదర్శన్ కన్పించకపోవుటచేత తపాలా బంట్రోతు వాటిని కిటికీ చువ్వల సందుల్లోంచి వరండాలోకి ఒక మూలకు జారవిడిచి వెళ్ళిపోతున్నాడు. సుదర్శన్ ఎప్పుడు ఇంటికి వచ్చినా హడావిడిగావచ్చి హడావిడిగా వెళ్ళిపోవుచుండుటచే కుప్పలుగా

---

పేరుకుని వరండాలో ఒకమూల పడివున్న ఆ జాబులు అతని కంటపడే అవకాశం కలుగలేదు "ఎన్ని జాబులు వ్రాసినను జవాబులేదు. యీ నా అనారోగ్యంతో పాటు మిమ్మల్ని గురించిన దిగులు కూడా ఒకటి నన్ను చాలా బాధపెడుతూన్నది. అదీగాక నాకు ఏవేవో పీడకలలు నిదురలోవచ్చి అశుభశకునములను చూపుతున్నాయి. విషయం తెలిసి వుంది కూడా, మిమ్మల్ని ఏకాంతంగా విడిచి రావటంలో చాలా గొప్పపొరపాటే చేశానని పశ్చాత్తాప పడుతున్నాను... మెుటల వెనుకటి పరిస్థితిలోకి దిగిపోయి ఈ ప్రపంచమునకు పనికిరాకుండా పోగలరేమోనని నేను తల్లడిల్లిపోతున్నాను. మీ యొక్క ప్రతిబింబం కొద్దిరోజులలోనే

ఈ లోకంలో కనులు విప్పమన్నది. గనుక ఇదివరకుకంటె మీరు ఈ ప్రపంచం తీరును మరింత ఎక్కువగా అర్థంచేసుకోవల్సిన బాధ్యత మీపై గలదని భావించండి. కొద్దికాలంలోనే యీ లోకపు మమతలలో చిక్కుకొనబోతున్నారనే విషయం మాత్రం మర్చిపోకండి... ఇత్యాది హెచ్చరికలతో కూడిన రేఖలు కూడా కొన్ని ఆ కుప్పలో లేకపోలేదు.

## 3

వెన్నెలరాత్రి తదియచంద్రుడు పాల్కడలిలోని వెండినావ వోలె గగనతలంపై ప్రకాశించుచూ మందంగా ముందుగా సాగిపోతున్నాడు. పాల వెన్నెల పొంగులలో వృక్షములు ధవళచ్ఛాయలో మెరిసిపోతూన్నాయి. సుమకస్యల సుకుమార హృదయముల నుండి సుగంధ వీచికలు సన్నగా చిందుతున్నవి. పూల మొక్కలపై నుండి భ్రమరగీతిక వినిపిస్తూన్నది. స్నేహలతాదేవి యొక్క కోమలదృష్టులు సుదర్శన్ మనసును చక్కలిగింతలు పెట్టుచున్నవి అతని హృదయంలో ఆమె అరుణాధరములు చిరునవ్వులు ఒలికిస్తున్నవి. శరశ్చంద్రికలు విరజిమ్ము ఆమె ముఖబింబం అతని హృదయసీమ యందు కొంటెగా నృత్యం సల్పుతూన్నది. వెంటనే అతని మనోపథమున విషాద మేఘములు క్రమ్మనవి. సుదర్శన్ లేచివెళ్ళి మేజా ముందు కూర్చుని దీపం పెద్దదిచేసి ఒక కాగితంపై ఈ విధంగా వ్రాయనారంభించాడు. "ఓ మిత్ర రత్నమా? ఈ విశాల విశ్వంలో నేను నీ తోడులేకుండా జీవింపలేనని తెలిసికూడా నన్నిట్లా అన్యాయం చేశావు. ఇది నీకు తగునా ?............ ఇంకా ఇంకా ఏమి వ్రాయటమా? అని ఆలోచింపసాగాడు. కాని ఏమీ తోచలేదు. మనసు అంతా వికలంగా వున్నది. చివరకు "స్వర్గానందమును కూర్చు ఒక అమూల్యవస్తువు కొద్దికాలంలోనే మనకు లంభిపగలదని చెప్పి వుంటివే ? అది ఎప్పుడు• ఇంకా ఎంతకాలం పడుతుంది.... అన్న మాటలతో మాత్రం ఆ లేఖ మాత్రం పూర్తిచేసి కవర్లోపెట్టి అప్పటికప్పుడా కవర్ని తపాలాపెట్టెలో వేసి వచ్చాడు.

ఆ లేఖకు జవాబు మూడవనాటి టపాలోనే దూకింది. అందులోని కొన్ని మాటలు మాత్రం ఇవి. 'అమూల్యమైన వస్తువుల్ని చూడగలిగే భాగ్యం అబ్బాలంటే కొంత ముడుపు చెల్లింపగలిగి వుండాలి. ఆరోజున వైభవోపేతంగా ఆనందోత్సవం జరుపుకోవలసి వుంటుంది. ఆ వస్తువును అలంకరించుటకు అభరణములకు ఇంకా ఏవేవోవాటికొరకూ పైకం చాలా అవసరం. ఇప్పటి

నుంచీ కూడబెడుతూ వుండండి...ఆ అమూల్య వస్తువును చాలా స్వల్పకాలం లోనే నా హస్తముల్లో చూచి ఆనందింపగలరు. త్వరపడకండి...కాని ఈ లేఖ కూడా వెనుకటిలేఖల కుప్పలోనికే దూకింది.

ఒకానాటి సాయంకాల సమయాన ఆచార్య సుదర్శన్ ధర్మశాలవద్ద బిచ్చగాళ్ళకు పైసలు పంచియిస్తూ వుండగా, తపాలా బంట్రోత్ వచ్చి ఒక టెలిగ్రాం ఇచ్చి వెళ్ళాడు సుదర్శన్ ఆ టెలిగ్రాంను విప్పి చూసుకున్నాడు శూన్యాకాశంవేపు ఒక తడవా, ఆ టెలిగ్రాంలోని అక్షరముల వంక ఒక తడవా దిగులుగా చూసుకుని గుబులుగా ముందుకు సాగివచ్చి ఒక్క గంతులో గదిలోకి దూకి స్నేహలతాదేవి ఫొటోముందు నిలబడ్డాడు ఒక పావుగంట మనోవికారంగా తలవంచుకుని నిలబడి తదుపరి ఆ ఛాయాపటంలోని స్నేహలతాదేవి యొక్క చెక్కిళ్ళను సాదరంగా నిమురుతూ కనుకొలుకుల నుండి జలబిందువులు ప్రవహించుతూండగా దీన కంఠస్వరాన అడిగాడు. 'ఇక నన్ను ఈ ప్రపంచంలో యెవరు బ్రతికిస్తారు? నా మిత్రరత్నపు మాట ప్రకారం నేను ప్రవర్తింప లేదనే కోపంతో దేవతలుచేసిన పనేనా ఇది?' ఈ ప్రశ్నలకు తగిన జవాబైతే సుదర్శన్ వాక్రూపమున పొందలేకపోయాడు గాని, ఆ చిత్రమందు స్నేహలతాదేవి ముఖబింబముగ ఏర్పడిఉండిన వంకరటింకర గీతలు మాత్రం కొంచెం ఆవేదనగా మూలినవి.

ఆరోజు అర్ధరాత్రి వేళ హోరుగాలిలో వర్షం కురుస్తూవుండగా కొల్లూరు రోడ్డు స్టేషన్‌లో రైలు దిగాడు సుదర్శన్ అచ్చటికి గ్రామం మూడుమైళ్ళ దూరమున వున్నది. తలపై తువ్వాలుగుడ్డ వుంచుకొని రోడ్డువెంట సాగిపో తున్నాడు. వాయుదేవుని తీవ్రకోపమునకు తాళజాలక రోడ్డున కిరుపైపులా వుండిన వృక్షములు భయకంపితముల్తై గగ్గోలు పెడుతూన్నవి.

సుదర్శన్ అత్తవారింటిని సమీపించుసరికి లోపలి నుంచి అలిసిపోయిన కంఠములనుండి సన్నగా ఆర్తనాదములు వినిపిస్తూన్నవి సుదర్శన్ లోపలకు ప్రవేశించుసరికి అతనిచుట్టూ నలుగురు కూడి ఘోరంగా విలపించుట ప్రారంభించారు. అతను వారినుండి బలవంతంగా నెట్టుకుని వెళ్ళి తన మిత్రరత్నము యొక్క నిర్జీవ దేహముచెంత ఆశీనుడై ధ్యానముద్రలో మునిగివుండిన ఒక పవిత్ర తపస్వినివలె కనిపించే ఆమె స్వరూపమును అదేతీరుగా పరికించుతూ అశ్రుతర్పణ విడుచుకుంటున్నాడు. కొంచెంసేపు గడచిన తదుపరి ఆమె ముఖ బింబమునకు దగ్గరగా వంగి, "లతా? అమూల్యమైన వస్తువును చూపిస్తానంటివి;

ఆనందింపచేస్తానంటివి! కాని ఏదీ చేయలేక అంబరవీధిలోకి రెక్కలుగట్టుకుని ఆకస్మికంగా పారిపోయినావేమి నా మిత్రరత్నమా?" అని విలపించుతూ క్రిందకు జరిగిపోయినాడు. వెనుకప్రక్కనే నిలబడియున్న బావమరిదిభార్య అతన్ని లేవదీసి నెమ్మదిగా గదిలోకి నడిపించుకు వెళ్ళి ఒక చిన్నమంచం ముందు నిలబెట్టి "అన్నయ్యా! మీ మిత్రరత్నం ఎన్నడూ అసత్యవాది కాదు. వాగ్దానం చెల్లించే శలవు తీసుకున్నది" అని అన్నది. అందు పరుండివున్న ఒక ఆడశిశువును చూపిస్తూ సుదర్శన్ మంచం ముందు నిలబడి, నాలుగు దినముల క్రితం మాత్రమే ఈ లోకంలో కనురెప్పలు విప్పి ఇంకనూ తాను ఎంతో కాలంపాటు నివసించివచ్చిన దివ్యలోకాల అద్భుత విషయాలను స్మరించుకుంటూ ఉండిన ఆ శిశువుయొక్క ముఖపద్మంలోనికి సూటిగా చూస్తున్నాడు. స్నేహలతాదేవి యొక్క ముఖగహ్వరం కిలకిలా నవ్వుతూన్నది. ఆ పసికందు యొక్క ఫాలభాగమందు అతని దృష్టి ఏకాగ్రమై నిల్చివున్నది. పవిత్రహృదయంగల 'ఓ ఉత్తమ మిత్రుడా! నేను ఈ లోకంలో కొంతకాలంపాటు మీకు మిత్రరత్నంగా ఉపయోగించాను ఒక సన్నిహిత వ్యక్తి అంటూ లేకుండా ఈ లోకంలో మీరు ఏకాంతంగా జీవింపలేరని తెలిసియీ పుత్రికారత్నమును మీకు అందజేసి భగవంతుని ఆజ్ఞానుసారంగా నేను నాదారిన వెళ్ళిపోతున్నాను మన కడుపుతీపితో నిండివున్న మన ఈ పుత్రికారత్నం మీ జీవన బాటకు అఖండ జ్యోతియై నిలిచి మీకు ఎంతగానో ఉపకరింపగలదని ఆశిస్తున్నాను!' అని స్నేహలతాదేవి యొక్క ఆ మహత్తర సందేశమేమైనా సుదర్శన్ ఆ పసిదాని నుదుటి చారలో చదువుతున్నాడా?

